ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 22 జూలై 2024

ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో ఉత్పత్తికి విఘాతం 8లో..

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు 8లో..



సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల చెక్‌డ్యామ్ మీదుగా వెళుతున్న మానేరు వరద నీరు

జోరు వాన..

- శ్రీపాద ఎల్లంపల్లికి పెరిగిన వరద
- మానేరుకు పెరుగుతున్న వరద నీరు
- సబ్బితం జలపాతానికి వెళ్లకుండా నిషేధం
- ఓసీపీ బొగ్గు గనుల్లో నిలిచిన ఉత్పత్తి

పెద్దపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలో నాలుగు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా, హుస్సేనిమియా వాగు, మానేరు నదిలో క్రమంగా ప్రవాహం పెరుగుతున్నది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షాలు పడుతున్నాయి. ప్రజలు ఇంటి నుంచి గడప దాటని పరిస్థితి ఏర్పడింది. ఆయా మండలాలు, పట్టణా ల్లోని లోతట్టు గ్రామాల ప్రజలను సంబంధిత అధికారులు, పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. పెద్దపల్లి మండలం సబ్బితం గట్టుసింగారం జలపాతం వద్దకు ఎవరు వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు నిషేధం విధించారు. అటువైపు ఎవరు వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు కట్టుదిట్టం చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కృష్ణ తదితరులు పెద్దపల్లి ప్రాంతంలో తిరుగుతూ రోడ్యాముల వద్ద వరద ఉధృతిని, వర్షాల పరిస్థితిని గమనించి ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి క్యాచ్‌మెంట్ ఏరియాలో 27,981 క్యూసెక్కులతో పాటు కడెం ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తడంతో 14,333 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఉదయం 8 గంటల వరకు 18 వేల క్యూసెక్కుల వరద నీరు రాగా, మధ్యాహ్నం 3 గంటల వరకు 36,259 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, 7.877 టీఎంసీలకు చేరుకున్నది. సోమవారం మధ్యాహ్నం వరకు 10 టీఎంసీలకు పైగా నీటి మట్టం పెరగనున్నది. మానేరు నదికి కూడా వరద ప్రవాహం పెరిగింది. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల వద్ద నిర్మించిన చెక్ డ్యామ్‌పై నుంచి వరద నీరు వెళుతున్నది. గోదావరిఖని ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఓసీపీ 1, ఓసీపీ 2, ఓసీప 3లో 56 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 42.9 మిల్లీమీటర్ల నగటు వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా ధర్మారం మండలంలో 56.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే పాలకుర్తి మండలంలో 49.6 మిల్లీ మీటర్లు, ముత్తారం మండలంలో 48.5 మిల్లీ మీటర్లు, మంథని మండలంలో 48.4 మిల్లీ మీటర్లు, జూలపల్లి మండలంలో 47.0 మిల్లీమీటర్లు, పెద్దపల్లి మండలంలో 45.0 మిల్లీమీటర్లు, ఎలిగేడు మండలంలో 43.5 మిల్లీ మీటర్లు, ఓదెల మండలంలో 41.9 మిల్లీ మీటర్లు, కమాన్‌పూర్ మండలంలో 40.5 మిల్లీ మీటర్లు, అంతర్గాం మండలంలో 40.1 మిల్లీమీటర్లు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 39.0 మిల్లీ మీటర్లు, సుల్తానాబాద్ మండలంలో 38.9 మిల్లీమీటర్లు, రామగిరి మండలంలో 24.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో జిల్లాలో గల చెరువులు, కుంటల్లోకి పెద్ద ఎత్తున నీళ్లు చేరి మత్తడులు దూకుతున్నాయి. హుస్సేనిమియా వాగుకు ప్రవాహం పెరిగింది. మానేరు నదిలో కూడా ప్రవాహం పెరిగింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 20 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నిర్మల్ జిల్లాలో గల కడెం ప్రాజెక్టుకు వరద పెరగడంతో గేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి వదిలి వేయడంతో ఆ నీళ్లు శ్రీపాద ఎల్లంపల్లికి చేరుకుంటున్నాయి. ఆయా మండలాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజ లను జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది.



హెచ్చరిక బోర్డుల వద్ద పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ



సుల్తానాబాద్‌లో వరద నీటితో నిండిన పొలాలు



మత్తడి దూకుతున్న బొంపల్లి చెరువు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

పాలకుర్తి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా..

- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



వేమునూర్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, జూలై 21: పాలకుర్తి మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలం పరిధిలోని వేమునూర్, కుక్కలగూడూర్, పుట్నూర్, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మక్కాన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎటువంటి అవినీతి లేకుండా పేదలందరికి సంక్షేమ ఫలాలు అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామ శాఖల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బురద రోడ్డుపై కూర్చొని కార్పొరేటర్ నిరసన

- డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సుమలత-రాజు, కాలనీవాసులు

కోల్‌సిటీ, జూలై 21: రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత-రాజు ఆధ్వర్యంలో కాలనీవాసులు బురద రోడ్లపై కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్పొరేటర్ నగునూరి సుమలత మాట్లాడుతూ కొంత కాలం నుంచి డివిజన్‌లో అభివృద్ధి చేయడం లేదని, ఎలాంటి నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. అయినా కార్పొరేషన్ అధికారులు, పాలకులకు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పద్మావతికాలనీ రహదారి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డివిజన్ నుంచి కార్పొరేషన్‌కు అత్యధికంగా ఎల్‌ఆర్‌ఎస్ నిధులు వస్తున్నప్పటికి అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు



గంగమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న గంగపుత్రులు

మంథని, జూలై 21: మంథనిలో గంగపుత్ర(బెస్త) సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మంథని పట్టణంలోని బోయినపేట నాగులమ్మ దేవాలయం వద్ద గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గంగపుత్రుల కులవృత్తి అయిన వలలు, చేపల బుట్టీలను చేత భూని గంగపుత్ర మహిళలు బోనాలను ఎత్తుకొని గోదావరి తీరానికి చేరుకున్నారు. గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించి గౌతమీ గోదావరి తీరంలో నిమజ్జనం చేసి భోజన తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు అంకరి కుమార్, గంధం వెంకటస్వామి, అంబటి సతీష్, అంకరి ప్రకాష్, అంకరి శివ, బోయిని నారాయణ, అంబటి కుమార్, అంబటి సురేష్, అంబటి నర్సింగ్, మోసం శంకర్, మోసం నర్సయ్య, అటికేటి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

మంథని, జూలై 21: వ్యాసపూర్ణిమ, ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 4 గంటలకు వేదోక్తంగా అభిషేకం, అర్చనలు, శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి కన్నుల పండువగా అలంకరించారు. భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళల భక్తులు సామూహిక శ్రీలలితా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గౌరిగుండాల జలపాతం సందర్శన తాత్కాలికంగా నిలిపివేత

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి రూరల్, జూలై 21 : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సబ్బితం గట్టుసింగారం గౌరిగుండాల జలపాతం సందర్శన తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. ఆదివారం బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో సబ్బితం గ్రామం పరిధిలోని జలపాతం వెళ్లే దారిలో బారికేడ్‌లు, హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి దారిని మూసివేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న దృష్ట్యా పెద్దపల్లి డివిజన్ పరిధిలోని మండలాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసిందని, దీంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జలపాతం సందర్శన కొద్దిరోజులు నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. జలపాతం వెళ్లే దారిలో ప్రత్యేకంగా పోలీస్ బందోబస్త్ ఏర్పాటుచేసినట్లు, సందర్శనకు వచ్చేవారికి గ్రామస్థులు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. వారి వెంట పెద్దపల్లి సీఐ కృష్ణ, పెద్దపల్లి, బసంత్ నగర్ ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు, ఆర్.స్వామిలతో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దబొంకూర్ నుంచి కొత్తపల్లి వెళ్లే దారిలో కాజ్‌వేపై అధిక వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రోడ్డుపై నీరు ప్రవహించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

పత్తిపాకలో విజృంభిస్తున్న జ్వరాలు

ధర్మారం, జూలై 21: మండలంలోని పత్తిపాక గ్రామంలో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ప్రతి ఇంటిలో పైరిత్రం స్ప్రే చేశారు. ఇటీవల ప్రతి ఇంటిలో జ్వరాలతో బాధపడుతున్నా స్థానిక వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. గత నెల 30 నుంచి ఇప్పటి వరకు ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నా నామమాత్రంగా మందులు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. స్థానిక వైద్యులు సత్వరమే వైద్యసేవలు అందిస్తే ఇంతవరకు రాకుండేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటిలో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని పలువురు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం గ్రామంలోని అన్ని వాడల్లో జ్వరాల బారిన పడిన వారందరితో మాట్లాడారు. వారికి ధైర్యం కల్పించారు. అంతేకాకుండా గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఖాళీ చేయాలి



కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, జూలై 21: శిథిలావస్థలో ఉన్న ఇళ్లు పూర్తిస్థాయిలో ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. వర్షాల వల్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయిన ఇళ్లను పరిశీలించామని, కూలిపోయే దశలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని సూచించామని తెలిపారు. కూలిన ఇళ్ల వద్ద మున్సిపల్ రిస్కీటీం సిబ్బందితో కలిసి సహాయక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లోని పురాతన ఇళ్లు కూలిపోతున్నాయని ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కానీ జరగలేదన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 6303127484 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు అలాగే రంగంపల్లి రాజీవ్ రహదారి వద్ద గల కాల్వర్టును పరిశీలించామని, పట్టణ ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మున్సిపల్ సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాం మహంత కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ దేవనంది రమాకాంత్, రిస్క్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జూలై 21: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్, ఎస్. వరుణ్ కుమార్, కోడారం వినయ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపట్టిందని, అవి వారికి అందే విధంగా కృషి చేస్తానన్నారు. జిల్లాలో దళిత వర్గాలు ఏవైనా సమస్యలుంటే తన వద్దకు రావాలని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంబేద్కర్ యువజన సంఘం దశాబ్దాల తరబడి దళిత అణగారిన వర్గాల కోసం కృషి చేస్తోందని, ఏ సమస్యలు వచ్చినా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే భారత దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన ఆర్టికల్ ద్వారా వచ్చిందన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ మాట్లాడారు. దళిత అనగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అంబేద్కర్ సంఘంలో పనిచేయడం వల్లనే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్ కాగలిగానన్నారు. భవిష్యత్తులో దళితులకు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘానికి అండగా ఉంటానన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ తరగతులలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య, ఆసంపల్లి శ్రీనివాస్, కొంకటి లక్ష్మణ్, లక్ష్మణ్, మైస రాజేష్, కాంపెల్లి సతీష్, చలిగంటి రామలక్ష్మి, పాల రాజేశం, బేకరీ రాజు, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సంక్షోభానికి పాలకులే కారణం..

కోల్‌సిటీటౌన్, జూలై 21: రైతాంగ సంక్షోభానికి కారణం నేటి కేంద్ర, రాష్ట్ర పాలకులే కారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఓయూప్రొఫెసర్ ఖాసీం, తెలంగాణ ఉద్యమకారులు, భారత్ బచావో వ్యవస్థాపకుడు గాదే ఇన్నయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరుపతయ్య మాట్లాడారు. రైతులను భూమి నుంచి వీడదీసేందుకు నాటి నుంచి ప్రయత్నాలు జరిగాయని, భూమి మీద సంపదపై పెత్తనం వహించడం కోసం సామ్రాజ్యవాదులు ఎత్తులు వేయడంలో భాగంగానే డబ్ల్యూటీవో లాంటి సంస్థలు ఏర్పాటు కాబడ్డాయని పేర్కొన్నారు. దిగుమతుల మీద ఆంక్షలు, ప్రపంచ బ్యాంకు ఒప్పందం నుంచి బయటపడాలని సూచించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16లక్షల కోట్లు మాఫీ చేయకపోవడం ఆ చిన్నపాటి రుణాల విషయంలో పాలకులు తాత్సారం చేయడం సరికాదన్నారు. సదస్సులో దళిత లిబరేషన్ ఫ్రెండ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మార్వాడి సుదర్శన్, కవి రచయిత ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం, టీజేఏసీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటమల్లయ్య, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా బాధ్యులు గంగారెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, శ్రీపతి గోపాల్, ప్రజాఫ్రంట్ నాయకులు గాండ్ల మల్లేశం, కొమురయ్య, విప్లవ రచయితల సంఘం నాయకులు బాలస్వామి రాజయ్య, ఎరుకల రాజన్న, మద్దెల దినేష్, రమేష్, చీదురు వసంతరావు, ఆనంద్, శివప్రసాద్, రాజు, రైతులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ..

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జూలై 21: రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంబిస్తుందని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీపై అనేక ఆంక్షలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. ఆదివారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేసీఆర్ పాలనలో తెలంగాణ రైతాంగం కళ్లల్లో ఆనందం నిండిందని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో కన్నీళ్లు మిగిలాయని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికి సంక్షేమ పథకాలను విజయవంతంగా అందించి దేశంలోనే దిక్సూచిగా నిలిచిందన్నారు. కేసీఆర్ చెప్పిన విధంగా ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. గోదావరి దిశను మార్చి తెలంగాణ ప్రజల దశ మార్చిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రపంచం అబ్బురపడే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారన్నారు. కాంట్రాక్టు నిర్లక్ష్యం కారణంగా మూడు పిల్లర్లు కుంగితే ఆ అపవాదును కేసీఆర్ మీద మోపి కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందే ప్రయత్నాలు చేసిందన్నారు. కేసీఆర్‌పై తప్పుడు మాటలు మాట్లాడిన నాయకులకు మేడిగడ్డలో ప్రవహించే గోదావరి నీరే నిదర్శనం అన్నారు. రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒక రకంగా మంత్రులు ఒకరకంగా మాట్లాడుతూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని, సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కేంద్రాలకు నిలయంగా ఉన్న రామగుండం ప్రాంతంలో జెన్‌కో ద్వారానే విద్యుత్‌కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రైతులకు ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాల జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పంటకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ గాదం విజయ, నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, అచ్చే వేణు, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేష్, నూతి తిరుపతి, జహిద్ పాషా, చెలుకలపల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, చల్లా రవీందర్‌రెడ్డి, ఆడప శ్రీనివాస్, తోకల రమేష్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

సిరిసిల్ల రూరల్, జూలై 21: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని సిరిసిల్ల పవర్ లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ పరిశ్రమల సమాఖ్య నాయకులు ప్రకటించారు. జేఏసీ అధ్వర్యంలో సోమవారం నుంచి చేపట్టనున్న రిలే నిరాహార దీక్షల పోస్టర్లను ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటి పాముల దామోదర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు పంతం రవి, కోడం రమణ మాట్లాడారు. నేతన్నలకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ఎనిమిది నెలలుగా నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పటివరకు దాదాపు 10 మంది మరమగ్గాల కార్మికులు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు, ఆసాములు మరమగ్గాలను తుక్కు కింద అమ్ముకుంటున్నారన్నా రు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆందో ళనలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టే రిలే నిరాహార దీక్షను కార్మికులు, ఆసాములు, యజమానులు విజయవంతం చేయాలని కోరారు. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, మండల సత్యం, బండారి అశోక్, గౌడ రాజు, ఏనుగుల ఎల్లయ్య, బూట్ల నవీన్, శ్రీరాం సత్యం, కోడం అశోక్, మండల బాలరాజు, గంగుల శ్రీనివాస్, శ్రీగాధ విష్ణు, అన్నల్‌దాస్ శ్రీనివాస్, సిరిమల్ల సత్యం పాల్గొన్నారు.

మాదిగలను అణచివేస్తున్న రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు


సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

పెద్దపల్లిటౌన్, జూలై 21: మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి అణచివేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మాదిగ శక్తి సదస్సులో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఒక్క మాదిగలనే కాకుండా బీసీలకు అందవలసిన రాజకీయ వాటాను దక్కకుండా చేస్తున్నాడన్నారు. మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే ముఖ్యమంత్రి అయ్యాక 80 లక్షల జనాభా కలిగిన మాదిగ జాతిని రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ మాదిగలను విడదీయడానికి రాజకీయ నాయకులు కుట్రలు చేస్తారని, ఆ కుట్రలకు మాదిగలు బలి కావద్దన్నారు. సీనియర్ పాత్రికేయుడు విఠల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు రాజకీయంగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తవలసిన అవసరం ఉన్నదన్నారు. కేసీఆర్ మోసం చేసిండనే మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను అన్యాయం చేశాడన్నారు. హైకోర్టు అడ్వకేట్ శరత్‌కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మాదిగలకు న్యాయంగా దక్కవలసిన రాజకీయ రిజర్వేషన్లను వెంకటస్వామి కుటుంబమే తన్నుకు పోతోందని, దీనికి రేవంత్‌రెడ్డి సహకరించారని విమర్శించారు. సమావేశంలో తెలంగాణ మాదిగ శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపాటి రజిని, జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, నియోజక వర్గ అధ్యక్షులు తాళ్ళపెల్లి అంజయ్య, నాయకులు కొమ్ము ప్రవీణ్ బాబు, మడిపెల్లి మొగిలి, బోటుకు రమేష్ బాబు, అక్క పాక తిరుపతి, డాక్టర్ శరత్ బాబు, వివేక్ పటేల్, తాళ్ళ పెల్లి రమేష్, బానోత్ సంజీవ్ నాయక్, మీసాల సాయిలు, దీపక్, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 18,518 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 19.693 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 33.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 503 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 13.378 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.065 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పాముకాటుతో యువతి మృతి

సైదాపూర్, జూలై 21: సైదాపూర్ మండలంలోని రాయికల్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లాని తండా గ్రామానికి చెందిన భర్మావత్ శిరీష(21) అనే యువతి పాముకాటుతో మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న శిరీష వ్యవసాయ పనులకు వెళ్లింది. పొలం గట్టుపై నుంచి వెళ్తుంగా కాలుకి నల్ల తాచు పాము కాటు వేసింది. వెంటనే శిరిష స్థానికులకు తెలపడంతో స్థానికులు, కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందింది. శిరీష తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలపారు.

బహుజనుల హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దాం

- భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్


అభివాదం చేస్తున్న మహేందర్, తదితరులు

వేములవాడ టౌన్, జూలై 21: రాష్ట్రంలో దళిత, బహుజన, గిరిజన, ముస్లిం మైనార్టీ హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దామని భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన భీమ్ ఆర్మీ ఆవిర్భావ సభ సందర్భంగా ముఖ్య అతిథిగా మహేందర్ హాజరై మాట్లాడారు. దళిత మైనార్టీల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తూ అనేక పోరాటాలకు పిలుపునిచ్చి విజయాలు సాధించిన చరిత్ర భీమ్ ఆర్మీకి చెందుతుందని అన్నారు. స్వతంత్రం వచ్చి యేళ్లు గడుస్తున్న దళిత, బహుజన, మైనార్టీలు సామాజిక, ఆర్థిక, రాజకీయా అణచివేతకు గురివుతున్నారన్నారు. బహుజ నులు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తే ఈ అణచివేతకు అడ్డుకట్ట వేయవచ్చని భీఎ ఆర్మీ నిరంతరం ప్రజ పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం అందించే దిశగా ఉద్యమిస్తుందని వివరించారు. భీమ్ ఆర్మీ ఉద్యమాల్లో విద్యార్థి యువకులు, మేధావులు బడుగు బలహీనవర్గాల వారంత బాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, నవీన్, అక్కనపల్లి శేఖర్, రాంజీ, దినేష్, ప్రదీప్, అరుణ్, సాగర్, రాజు, మహిపాల్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

తల్లి బాగోగులు చూసుకోని కుమారులు

- శిథిలావస్థలో ఉన్న ఇంటిలో వృద్ధురాలు

- కలెక్టర్‌కు కుమార్తె ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూలై 21: ముసలితనంలో ఆలన పాలన చూడాల్సిన కన్న కొడుకులే పట్టించుకోక పోవడంతో ఆ వృద్ధురాలు అనాథగా మారింది. అధికారుల కథనం మేరకు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో కోట లచ్చమ్మ (80)కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అందులో ఒక కుమా రుడు మృతి చెందాడు. శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లచ్చమ్మ శనివారం ప్రమాదవశాత్తు జారిపడగా కుమారులతో పాటు కుమా ర్తెకు స్థానికులు సమాచారం అందించారు. కుమార్తె మల్లవ్వ మాత్రమే తల్లి వద్దకు రాగా కుమారులు రాలేదు. లచ్చమ్మ పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు తన అత్తగారింటి వద్ద ఉంటున్నాడు. మూడో కుమారుడు నగునూర్‌లోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. నాలుగో కుమారుడు మృతి చెందాడు. దీంతో సోదరులు తన తల్లి బాగోగులు చూడలే దంటూ కలెక్టర్ పమెలా సత్పతికి కుమార్తె ఫిర్యాదుచేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం తహసీల్దార్ నవీన్, ఆర్ఐ వాస్తవిక్, బ్లూకోర్టు పోలీసులు లచ్చమ్మను చికిత్సకోసం కరీంనగర్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.


వృద్ధురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం


మత్తడి దూకుతున్న మానకొండూర్ మండలం దేవంపల్లి చెరువు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేని వాన కురుస్తోంది. దీంతో చెరువులు నిండుకుండలా మారాయి. వాగులు మత్తడి దూకుతున్నాయి. రోడ్లు జలమయం కాగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నిలిచిన వాన నీటిని డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు.


మత్తడి దూకుతున్న మూలవాగు చెక్‌డ్యాం


చిగురుమామిడి మండలం ఇందారం-కోహెడ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


కోతిరాంపూర్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీటిని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది


వడుకాపూర్ శివారులో హుస్సేన్‌మియా వాగు రోడ్యాంపై ప్రవహిస్తున్న వరద నీరు


పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో లోలెవల్ వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణ


చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో మత్తడి దూకుతున్న గార్ల కుంట

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ


భక్తులతో సురేష్ ఆత్మరామ్ స్వామిజీ

మల్యాల, జూలై 21: కొండగట్టు గిరిప్రదక్షణను ఆదివారం చిలుకూరి బాలాజీ స్వామి శివాలయ ప్రధానర్చకులు సురేష్ ఆత్మరామ్ స్వామిజీ ఆధ్వర్యంలో అంజన్న భక్తులు చేశారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంను 16వసారి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి, జూలై 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆదివారం తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లె గ్రామ శివారులో వాగు నుంచి నేరెళ్లకు ఇసుక ను తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్లు సీజ్ చేశామని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణా సమాచారాన్ని సేకరించిన సిబ్బంది మల్లేశం, కిరణ్, సంపత్‌ను అభినందించారు.

బతుకమ్మ చీరల బకాయిలు ఎప్పుడిస్తరు?

- రెండేళ్లుగా పెండింగ్‌లో మూడు కోట్ల రూపాయలు
- బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేత కార్మికులు


మగ్గాలపై తయారు చేస్తున్న బతుకమ్మ చీరలు

గంగాధర, జూలై 21: కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఆడబిడ్డలకు దసరా కానుకను అందించడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బతుకమ్మచీరల బకాయిలు రెండేళ్లుగా నిలిచిపోయాయి. సుమారుగా మూడు కోట్ల రూపాయల బకాయిలు ఎప్పుడిస్తారని మగ్గాల కార్మికులు ఎదురు చూస్తున్నారు. మినీ సిరిసిల్లగా పేరొందిన గంగాధర మండల గర్షకుర్తిలో 16 వందల మగ్గాలపై వస్త్రాలను తయారు చేస్తారు. మగ్గాలపై మూడు వందల మంది ఆసాములు, ఐదు వందల మంది కార్మికులు ఆధారపడ్డారు. చేనేతను బలోపేతం చేయడానికి కార్మికులకు చేతినిండా పనికల్పించేందుకు గత ప్రభుత్వ బతుకమ్మ చీరల తయారిని గర్షకుర్తికి అప్పగించింది. 2022 సంవత్సరానికి 20లక్షలు, 2023 సంవత్సరానికి 34లక్షల మీటర్ల గుడ్డను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చింది. వివిధ రంగులు, డిజైన్లతో బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందుగానే అందించాలని అధికారులు తొందరపెట్టగా రాత్రి, పగలు పనిచేసి గడువుకన్నా ముందుగానే చీరలను అందించారు. చీరల తయారీ మూడు నెలల సమయంలో గర్షకుర్తిలో ఎక్కడ చూసినా సాంచల సప్పుడే వినిపిస్తుండేది, వాడవాడల బీములు నింపటోళ్లతో, చీరలను తీసుకెళ్లే ఆటోలతో సందడిగా ఉండేది. అయితే గత ప్రభుత్వ చీరల తయారి చేసిన ఆసాములకు రెండేళ్లుగా డబ్బులు ఇవ్వడం ఆగిపోయింది. చీరల తయారీ బిల్లులు అందించాలని కోరగా 30 శాతం అప్పటి ప్రభుత్వం అందించింది. మరింత రావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు చేతులెత్తేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకా ఏప్రిల్‌లో బిల్లులు అడగగా 40 శాతం మంజూరు చేసింది. ఇంకా 30 శాతం బిల్లులు రావాల్సి ఉంది. అయితే ఆసాములు కార్మికులకు అప్పులు చేసి జీతాలు ఇచ్చామని ప్రభుత్వం నుంచి బిల్లులురాక మగ్గాలు మూతపడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం చేనేత కార్మికులపై ప్రత్యేక చొరవ తీసుకుని మగ్గాలకు రావాల్సిన పాత బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నారు. సుమారుగా ఒక్క గర్షకుర్తికే 3కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

● రూ. 20 లక్షల వరకు రావాల్సి ఉంది



అలువాల తిరుపతి, ఆసామి గర్షకుర్తి

లక్షల మీటర్ల చీరలను అందించారు. చీరలు తయారు చేసిన వెంటనే డబ్బులు ఇస్తామని అధికారులు తొందర పెట్టి రాత్రీపగలు పనులు చేయించారు. రెండేళ్ల నుంచి నాకు రావాల్సిన రూ. 20లక్షల బిల్లు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు అందించి ఆదుకోవాలి.

మద్యం తాగేందుకు దోపిడీ

- ● బంగారు, వెండి గొలుసులతోపాటు ఐఫోన్ అపహరణ
- ● నిందితులను పట్టుకున్న పోలీసులు
- ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, జూలై 21: ఇద్దరు మిత్రులు మద్యం తాగేందుకు ఓ వ్యక్తి వద్ద దోపిడీకి పాల్పడి నగదు, బంగారు, వెండి గొలుసులతో పాటు ఐఫోన్ అపహరించగా నిందితుల ఊహాచిత్రాల ఆధారంగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఈ మేరకు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రాజారానికి చెందిన గుర్రం వెంకటేష్, మల్యాల మండల కేంద్రానికి చెందిన మల్యాల విష్ణువర్ధన్ మిత్రులు. నాలుగు నెలల క్రితం విష్ణువర్ధన్ దుబాయి వెళ్లి వచ్చాడు. వచ్చాక దావత్ ఇవ్వాలని విష్ణువర్ధన్‌ను అడుగగా ఈ నెల 9న కొండగట్టుకు వచ్చి మార్గమధ్య లోని కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీల వద్దకు వెళ్లే దారిలో ఇద్దరు మద్యం తాగారు. మరింత మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేసి తాగాలనుకున్నారు. అదే సమయంలో జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతున్న క్రమంలో వెంకటేష్, విష్ణువర్ధన్ స్వామిని కర్రలతో కొట్టి అతని మెడలో గల తులంన్నర బంగారు గొలుసు, మూడు తులాల వెండి బ్రాస్‌లెట్, రూ.3500నగదుతో పాటు ఐఫోన్ లాక్కొని పారిపోయారు. దొంగిలించిన వస్తువులను వెంకటేష్ తన ఇంటికి తీసుకెళ్లాడు. బాధితుడు ఇచ్చిన వివరాల ప్రకారం ఊహాచిత్రాలను రుపొందించి, సాంకేతికత ఆధారంగా మళ్లీ చోరీకి ఆదివారం స్కెచ్ వేస్తుండగా పోలీసులు వచ్చి ఇద్దరిని పట్టుకున్నారు. దొంగిలించిన వస్తువుల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద బంగారు, వెండి గొలుసులు, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్, ఏఎస్సైలు మల్లారెడ్డి, కృష్ణ హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, బాష పాల్గొనగా కేసు త్వరితగతిన చేధించిన సీఐ, ఎస్సై, కానిస్టేబుల్లు రాజేందర్, సంతోష్‌లను డీఎస్పీ అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 21: మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన తూము సుమలత(36) అనే వివాహిత అప్పుల బాధ భరించలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమలత భర్త బాలయ్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలీ పనిచేసుకుంటూ సుమలత తన ఇద్దరు కూతుళ్లను పోషించింది. సంవత్సరం క్రితం తన పెద్దకూతురు వైష్ణవికి రూ. 10 లక్షలు అప్పుచేసి పెళ్లి చేసింది. అప్పటి నుంచి అప్పుతీర్చే మార్గం లేకపోవడంతో తరచూ భాదపడుతూ ఉండేది.

ఇదే క్రమంలో ఆదివారం ఉదయం సుమలత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు జగిత్యాల ఏరి యా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమలత మృతితో బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతురాలి తండ్రి పిట్ట రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెల్పూర్‌కు పొంచి ఉన్న ముంపు ముప్పు

- ● బ్యాక్ వాటర్‌తో యేటా మునుగుతున్న ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు
- ● వర్షం పడిన ప్రతీసారి సురక్షిత ప్రాంతాలకు తరలింపు

హుజూరాబాద్‌రూరల్, జూలై 21: మండలంలో అతిపెద్ద మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చెల్పూర్‌కు ముంపు ముప్పు పొంచి ఉంది. అటు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రతియేటా ప్రజలు నరకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోని పెద్ద, చిన్న చెరువుల బ్యాక్ వాటర్ మూలంగా ప్రతియేటా గ్రామంలోని ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు నీటమునుగుతున్నాయి.

● కలగానే మిగిలిన రిజర్వాయర్ నిర్మాణం..

గ్రామంలో 362 ఎకరాల్లో పెద్ద చెరువు, 285 ఎకరాల్లో చిన్న చెరువులు ఉన్నాయి. రెండు చెరువుల మధ్య లింక్ కెనాల్ గ్రామం మధ్యలో నుంచి ఉంది. రెండు చెరువులను కలిపి రిజర్వాయర్‌గా నిర్మిస్తామని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొదలుకొని నిన్నటి ఎన్నికల వరకు ప్రజాప్రతినిదులు హామీలు ఇచ్చారే తప్ప.. హామీ కార్యరూపం దాల్చడం లేదు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరే అవకాశం ఉంటుంది.

● వెంటాడుతున్న ప్రధాన సమస్యలు..

రెండు చెరువుల మధ్య గ్రామం మధ్యలో నుంచే వెళ్తున్న లింక్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సెట్ బ్యాక్ వాటర్‌తో నిత్యం ఎస్సీ కాలనీ నీట మునుగుతుంది. లింక్ కెనాల్‌కు లైనింగ్ చేయిస్తే సమస్య తీరే అవకాశం ఉంటుంది. జూపాక గ్రామం వైపు ఒక మత్తడి, చెల్పూర్‌లో రెండు వైపుల మత్తడి ఉంది.

వానాకాలం మత్తడి ఎక్కువగా ఉంటే జూపాక-చె ల్పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఒక వేళ పెద్ద చెరువు కట్ట తెగితే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉంది. మత్తడిలపై వంతెన నిర్మిస్తే వానాకాలంలో కట్ట తెగితే సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది.


చిన్న చెరువు నుంచి డంప్ అవుతున్న వరద నీరు(ఫైల్)


ఎస్సీ కాలనీలో చుట్టుముట్టిన వరద నీరు(ఫైల్)

● నిర్మాణాలకు నోచుకోని తూములు..

దీనికి తోడు చెరువులకు సంబంధించిన తూములు సైతం నిర్మాణాలకు నోచుకోవడం లేదు. రెండు చెరువులకు సంబంధించిన లింక్ కెనాల్ గ్రామం మధ్యలోని ఎస్సీ కాలనీ గుండా వెళ్తుంది. వానాకాలంలో మాణిక్యాపూర్, నర్సింగాపూర్, కందుగుల గ్రామాల్లోని చెరువుల నీరు, హుజూరాబాద్ పట్టణ శివారులోని చిలుకవాగు వరద నీరు పెద్ద చెరువులోకి వస్తుంది. వరదను పెద్ద చెరువు నుంచి చిన్న చెరువులోకి డంప్ చేసే సమయంలో సెట్ బ్యాక్ వాటర్‌తో ఎస్సీ కాలనీ, సమీప గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. ఫలితంగా ప్రతియేటా ఎస్సీ కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● శాశ్వత పరిష్కారం చూపితే మేలు..

- నేరేళ్ల మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్, చెల్పూర్



గ్రామంలో ఎస్సీ కాలనీ పక్క నుంచి లింకె కెనాల్ వెళ్తున్న సమయం లో ప్రతియేటా వరద మూలంగా కాలనీ మునుగుతుంది. ఈ సమస్య తీరాలంటే వెంటనే పెద్ద, చిన్న చెరువులను కలుపుతూ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరుతుంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, నగదు అపహరణ

మల్యాల, జూలై 21: మల్యాల మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పుప్పాల దేవయ్య అనే వ్యక్తి శనివారం ఇంటికి తాళం వేసి ఇదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తన ఫోన్‌లో ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా ఇంటి ద్వారం తెరచి ఉండడం కనిపించింది. దీంతో అతను, బంధువులు వచ్చి పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు ద్వారం తాళం, గొళ్లెం పగులగొట్టి లోపలికి వెళ్లి ఇంట్లోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. దీంతో దేవయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్‌కుమార్ సంఘటన స్థలంలో క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో గాలించారు. బీరువాలోని రూ.43 వేల నగదుతో పాటు తులం బంగారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు

ఇల్లందకుంట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి


రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు


ఇల్లందకుంట, జూలై 21: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు తప్పకుండా కృషి చేస్తానని హెటిరో డ్రగ్స్ అండ్ ఫార్మసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా, ఆశీర్వచ మండపంలో ఎంపీ పార్థసారథిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఎంపీ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఆలయానికి కావాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈవో తన దృష్టికి తీసుకవచ్చారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, ఆలయంలో రేకుల షెడ్డు నిర్మాణం, కొతపల్లి, మల్యాల గ్రామ శివారులో రెండు ఆర్చీల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో కూడా ఆలయానికి సుమారు మూడు కోట్ల రూపాయలతో సాలారం, రాజగోపురం, బండ పరుపు, స్వామివారి కల్యాణానికి మండపం లాంటి పనులు తన సొంత ఖర్చులతో చేపట్టానని గుర్తు చేశారు. అదేవిధంగా ఆలయ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినట్లయితే తప్పకుండా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, మధు, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 21: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆషాఢ మాస పౌర్ణమి పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో చేరిన కొత్త నీటితో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో క్షీరాభిషేకం, నిత్య పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

ధర్మపురి వద్ద గోదావరి వరద


ధర్మపురి వద్ద స్నానఘట్టాలు అనుకుని ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 21: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆది వారం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిండి పోయిన చెరువులు, కుంటలు, వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడు కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ గో దావరి నదిలోకి 14,333 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం పెరిగి ప్రజలు ఇబ్బం దులకు గురవుతున్నారు. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు దాటి నీటి ప్రవాహం కొనసాగుతుంది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయా యి. రాత్రి వరకు గోదావరి నది వరద మరింత పెరిగే అవకాశం ఉంది. సమీప గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమ త్తం చేశారు. వరద ప్రాంతాన్ని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు.

● కోటిలింగాల వద్ద..

వెల్గటూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి లోకి వరద నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 18227 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరి లోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరి లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పున్య స్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు. కాగా మండలంలో గత రెండు రోజులుగా ముసురు వాన పడుతోంది. దీనితో చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. మండలంలో ఆదివారం 61.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.


కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

ఎడతెరిపి లేని వర్షం..


ఈసాలతక్కళ్లపల్లి గ్రామ చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ ఆర్ స్వామి


ఓదెలలో చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ అశోక్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, జూలై 21 : పెద్దపల్లి మండల వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి వర్షం కురుస్తోంది. దీంతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని బొంపల్లి చెరువులో వరదనీరు చేరి నిండుకోవడంతో వర్షపు నీరు మత్తడి దూకుతోంది. ఈ సందర్భంగా జాలర్లు మత్తడి ప్రాంతంలో చేపలు పట్టే పనిలో నిమగ్నమయ్యారు. మారేడుగొండ, అప్పన్నపేట, కనగర్తి, రాఘవపూర్ చెరువులు కురుస్తున్న వర్షానికి నిండుకుండలా దర్శనమిస్తున్నాయి.

ఓదెల, జూలై 21 : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు నీటితో నిండి ప్రమాదస్థాయిలో ఉన్న చెరువులను ఆదివారం ఎస్ఐ అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు పట్టేందుకు ఎవరు కూడ మానేరు వాగులోకి వెళ్లవద్దని తెలిపారు. వరద నీటితో నిండిన చెరువులు గండ్లుపడే అవకాశాలు ఉన్నందున వెంటనే సమాచారం అందజేయాలని ఎస్ఐ కోరారు. అలాగే ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గుంపుల తదితర చెరువుల్లోకి వరదనీటి ప్రవాహం పెరుగుతున్నందున గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

సుల్తానాబాద్, జూలై 21: గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేరు నది నీటితో నిండిపోయింది. చెక్‌డ్యామ్‌పై నుంచి వరద నీరు దూకుతోంది. సమీప పొలాలు నారుమళ్లు నీటితో నిండిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీరుకుళ్ల మానేరు పూర్తిగా జలకళను సంతరించుకుంది. పైనుంచి కూడా వరద రావడంతో రంగనాయకుల స్వామి ఆలయానికి ముందు భాగంలో పూర్తిగా నీరుచేరింది. ఆటు గొల్లపల్లి వరకు ఇటు రోడ్డు వంతెన వరకు వరద నీరు చేరింది. ప్రసిద్ధి చెందిన శ్రీభూనీలా సమేత రంగనాయకస్వామి ఆలయం ప్రహరీ చుట్టూ మానేరు నీరు నిండి ఉంది. దీంతో అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎవరూ కూడా మానేరు వాగులో దిగవద్దని స్నానాలు చేయవద్దని అంటున్నారు. రైతులు తమ వ్యవసాయ పనులను వర్షం తగ్గిన తర్వాతనే మొదలు పెట్టుకోవాలని ఈ వర్షాలలో కరెంట్ మోటార్లు వైర్లు స్విచ్చుల జోలికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. పోలీసులు పలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు. కాగా సుల్తానాబాద్ నుంచి నీరుకుళ్ల రోడ్డుతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే నాట్లు పూర్తిచేసుకున్న రైతుల పొలాల్లో పూర్తిగా వరద నీరు చేరింది. వరుస వర్షాలతో ఇప్పటికి నాట్లు వేయని రైతులు మరి కొన్ని రోజుల ఆగాల్సిన పరిస్థితి ఎదురయింది. వానలకు నారుమడులు కూడా కొంత దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జూలపల్లి, జూలై 21 : మండలంలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండిపోయి మత్తళ్లు దుంకుతున్నాయి. దీంతో మండల వ్యవసాయ రైతన్నల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. విస్తారంగా కురుస్తున్నా వర్షాలకు ప్రధాన రోడ్లపై నీరు చేరి రొడ్యాంలపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకల ప్రయాణికులకు అంతరాయం కలిగి ఇబ్బందులు పడుతున్నారు. వడుకాపూర్ గ్రామ శివారలోని ఉసేమినియావాగు రోడ్యాంపై వరద నీల్లు ప్రవహిస్తుండడంతో ప్రయానికులు రోడ్యాం దాటేందుకు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మాణం చేసిన రోడ్యాం కాలం చెల్లిపోయి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదస్థాయిలో ఉంది.

మంథని, జూలై 18: నాలుగు రోజులుగా మంథని ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తుంది. ఆదివారం సైతం నిరంతరాయంగా వర్షం కురవడంతో పట్టంలోని, గ్రామాల్లోని డ్రైనేజీలు, రోడ్లన్ని జలమయం అయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేటలో కుమ్మరికుంట సమ్మక్క పాత ఇల్లు ఆదివారం ఉదయంకూలిపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేత పోలు శివ, బయ్య లింగయ్యలు ఇంటి సందర్శించి బాధితులను పరామర్శించి విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్ఐ త్రివేణి, శ్రీనివాస్‌లు ఇంటి పరిశీలించి బాధితులకు 25 కిలోల బియ్యం, వారానికి సరిపడ నిత్యావసర వస్తువులను అందజేశారు. మంథని ఆర్టీసి బస్టాండ్ అవరణ చెరువును తలపించింది. చెరువులు, కుంటలు నిండాయి. గోదావరి, మానేరు నదులు, పట్టణ శివారులోని బొక్కలవాగు వరద నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. వర్షంతో జనం సతమతమయ్యారు. పలుమార్లు కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది. కొంచెం ఆలస్యమైన కూడ వర్షాలు బాగా కురుస్తుండటంతో వ్యవసాయ పనులు సాగుతుండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మారం, జూలై 21: మండలంలో ఆదివారం ఓ మోస్తారులో వర్షం కురుస్తుంది. ఏకదాటిగా కురుస్తున్న వర్షం కారణంగా రోడ్లన్ని బురదమయమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై ప్రజలు కాలినడకపై నడవాలన్న ఇబ్బంది పడుతున్నారు. మోస్తారు వర్షం కురుస్తున్నప్పటికి చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా నీరు చేరుతోంది. నిత్యం వర్షం కురవడం వలన ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పరిస్థిలో అయితేనే ప్రజలు బయటకు వచ్చి వెళ్తున్నారు. ఈ వర్షం కారణంగా మండలంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

ముత్తారం జూలై 21 : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు కుంటలకు నీరు చేరుకుంది. ఓడేడు, ఖమ్మంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నిండుకుండలాగా ప్రవహిస్తోంది. ఇలాగే కొనసాగితే ప్రమాద హెచ్చరికలు జారీచేసే అవకాశాలు ఉన్నాయని తహసీల్దార్ సుమన్ పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటికిరావాలని ఎస్సై మధుసూదన్‌రావు కోరారు.

పాలకుర్తి, జూలై 21: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. ఆదివారం ఆయన మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామ చెరువు తూమును, కొత్తపల్లె గ్రామ వాగును పరిశీలించారు. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకుంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు ఫోన్ చేయాలన్నారు.

కళ్యాణ్‌నగర్, జూలై 21 : ఐదు రోజులుగా వర్షం వీడడం లేదు. రాత్రిపగలు తేడా లేకుండా ఎడతెరిపి లేకుండా వర్షాలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కాలువలు పొంగిపొర్లుతుండగా ఫైవింక్లయిన్, 2ఏ మోరీ నిండుగా ప్రవహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదు రోజులుగా విడవకుండా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వానలు దంచి కొడుతున్నాయి. ఈనెల 17న 1 సెంటీ మీటర్, 18న 7సెంటీ మీటర్లు, 19న 1సెంటీ మీటర్, 20న 5సెంటీమీటర్లు, ఆదివారం 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో కార్పొరేషన్‌లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావడం లేదు. ఐదు రోజులుగా వ్యాపార, వాణిజ్య సంస్థలు జనం లేక వెలవెలబోయాయి. ఐదు రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వర్షాలు దంచి కొడుతుండడంతో సింగరేణిలోని నాలుగు ఓసీపీల్లో పనులను నిలిపివేశారు. క్వారీల్లోకి భారీగా నీరు చేరడంతో అధికారులు మోటార్ల సహాయంతో నీటిని బయటకు తోడుతున్నారు. క్వారీలకు వెళ్లే రోడ్లన్నీ బురదమయం కావడంతో భారీ యంత్రాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. గోదావరిఖని మల్లికార్జున్‌నగర్, ఐబీకాలనీ, మార్కండేయకాలనీల్లోని ప్రధాన నాలాలు పొంగిప్రవహిస్తున్నాయి. విఠల్‌నగర్‌లోని పాత ఇళ్లు వర్షానికి నాని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో జన జీవనం స్థంభించింది.


నీరుకుల్ల రంగనాయక స్వామి ఆలయం వరకు చేరిన నీరు

పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్, జూలై 21 : మండల కేంద్రంలో మండల ఫొటోగ్రాఫర్స్‌వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏఎస్ఐ బాలాజీనాయక్, హెడ్‌కానిస్టేబుల్స్ రహమాన్, జంపయ్య చేతుల మీదుగా జరిగింది. అధ్యక్షుడు కొండి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పోలుదాసరి రమేష్, కోశాధికారి జంగిలి పోచాలు, సభ్యులు వడ్లకొండ తిరుపతి, తోట శ్రీనివాస్, ముత్యం సతీష్‌గౌడ్, తోట నాని, కొంతం కుమార్, కొత్తపల్లి సతీష్, చింటూ, తోడేటి సాయి, బర్ల సదానందం, కొండి సాయి, అభి, బాణాల చరణ్, సందవేణ నాగరాజు తదితరులు ఉన్నారు.

ముత్తారం జూలై 21:తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26,27,28 తేదీల్లో హైదరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే తెలంగాణ ఫొటో ఎక్స్ పోస్టర్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అధ్యక్షులు రెడ్డి భాస్కర్‌తో పోస్టర్ ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షుడు రామగిరి శ్రీనివాస్, అధ్యక్షుడు అనుము వీరస్వామి. ప్రధాన కార్యదర్శి వైద్య రాజేందర్, కోశాధికారి గుట్ల తిరుపతి, గోదావరిఖని ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్ కోశాధికారి బండారి ప్రసాద్, సముద్రాల శంకర్ చొప్పరి రమేష్ దేశిని రాజు కొత్త నరేష్ రాజు, కుమార్, క్రాంతి, ఫొటోగ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కమాన్‌పూర్, జూలై 21 :మండలంలోని రొంపికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన బూర్ల శృతి, అనవేణ అక్షయలను ఆ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు. అలాగే వీరికి ప్రోత్సాహకంగా నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కుందారపు బాపు, తెలుగు ఉపాధ్యాయులు అశోక్ తదితరులు ఉన్నారు.

నియామకం

కోల్‌సిటీటౌన్, జూలై 21: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్‌గా గోదావరిఖనికి చెందిన కల్వల సంజీవ్ నియామితులయ్యారు. ఈమేరకు ఆదివారం జరిగిన సంఘం శిక్షణ తరగతులలో సంజీవ్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినయ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తన వంతుగా కృషి చేస్తానని సంజీవ్ పేర్కొన్నారు.

రామగిరి, జూలై 21: మండలం అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా గిరవేని రాములు యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన యాదవ మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మేకల మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఉడుత పర్వతాలుయాదవ్, జిల్లాసీనియర్ నాయకుడు తొట్ల తిరుపతియాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో డివిజన్ ఉపాధ్యక్షుడిగా శ్రీరాముల కుమార్‌యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బంక అంజయ్య యాదవ్, మండల యూత్ అధ్యక్షుడిగా కాల్వశ్రీనివాస్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమారస్వామి ఎన్నికయ్యారు.

డైమండ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక

కోల్‌సిటీటౌన్, జూలై 21: గోదావరిఖని ప్రాంతంలో గీతాంజలి పాఠశాలను నెలకొల్పి గత మూడున్నర దశాబ్దాల కాలంగా విద్యా రంగంలో సేవలందిస్తున్న కంది రవీందర్‌రెడ్డి డైమండ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సెమ్స్ ఒలంపియాడ్ ఆర్గనైజేషన్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి, కో ఆర్డినేటర్ ఎస్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రవీందర్‌రెడ్డిని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు అంజారెడ్డి, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు అదర్‌సండే సమ్మారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరిగౌడ్, ప్రధానకార్యదర్శి చందుపట్ల తిరుపతిరెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాలల కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

ఎమరాల్డ్ అవార్డు ప్రదానం

జ్యోతినగర్, జూలై 21: ఎన్టీపీసీలోని విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బంధారపు యాదగిరిగౌడ్‌కు గురుపౌర్ణమి సందర్భంగా అవార్డు లభించింది. నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి విశ్వభారతి విద్యా సంస్థ చైర్మన్ యాదగిరిగౌడ్‌కు ఎమరాల్డ్ అవార్డు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిగౌడ్‌కు గోల్డెన్ అవార్డులు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ముత్తారం జూలై 21: మండలంలో 14గ్రామ పంచాయతీలకు 11 మంది కార్యదర్శులను కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం నియమించారు. ఈ మేరకు నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఖమ్మంపల్లి, అడవీశ్రీరాంపూర్, ముత్తారం గ్రామ పంచాయ తీలకు కార్యదర్శులను ఇంకా నియమించ లేదు. ఇందులో దరియాపూర్ గుంటి సంధ్య, హరిపురం టి.నవ్య, ఇప్పల్లపల్లి మేరుగు అంజలి,కేశనపల్లి బూర్ల రాజేందర్, లక్కారం గర్రె పల్లి నరేష్, మచ్చుపేట ఎన్. సురేందర్, మైదంబండ భద్రు ఇస్లావత్, ఓడేడు ఇ.రవీందర్, పారుపల్లి ఎ. మల్లీశ్వరీ, పోతారం ఎన్. జయపాల్, సీతంపేట వయాజ్ మహ్మద్లను నియమించారు.

కాంకాలమ్మ దేవత బోనాలు

భగత్‌నగర్, జూలై 21: కరీంనగర్ జిల్లా మేదరి (మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో కులదేవత అయిన కాంకాలమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. మేదరి (మహేంద్ర) కుస్తులు బోనాలు నెత్తిన ఎత్తుకుని దేవతకు సమర్పించి వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్, రాజనర్సు, గంగాధర్, సర్వేశం, రాజు, రాయమల్లు, శనిగరపు సతీష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

సుల్తానాబాద్, జూలై 21: వ్యాస, గురు పూర్ణిమను పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ఆలయ నిర్వాహకులు రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులను సత్కరించారు. రాజమాత ఆలయంతోపాటు పలు ఆలయాల్లో అర్చకులు వేద పండితులను కూడా ఆయా భక్త బృందాలు ఘనంగా సన్మానించాయి. లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.

పెద్దపల్లి రూరల్, జూలై 21: గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం మండలంలోని పెద్దబొంకూర్‌లో విద్య నేర్పిన గురువుకు పాదాభివందనం చేసి వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మిట్టపల్లి కనుకయ్య గ్రామానికి చెందిన యువకులకు విద్య నేర్పడంతో విద్యార్థులు అతని కాళ్లు కడిగి, పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాస్, కల్వల తిరుపతి, కలవేని రవి, వేముల సురేష్, తోటపల్లి వెంకటేషం, ఏలిగేటి రాయమల్లు, మధునయ్య, లింగయ్య, కోమురయ్య, రాజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 21 : మండల కేంద్రంలోని బాపూజీనగర్‌లోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబాను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

మంథని, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకొని మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఆదివారం సంస్థ అధ్యక్షుడు కొండెల మారుతి సత్కరించారు. ఈకార్యక్రమంలో పలువురు వక్తలు, టీచర్లు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 21: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానఅర్చకులు గోవర్ధనగిరి వేణుమనోహరచార్యులు, శ్యాంసుందరచార్యుల వేదమంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు దంపతులు హాజరై విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. కొసరాజు అనిల్, భాగ్యలక్ష్మి దంపతులు అన్న సంతర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ వనం రాంచందర్‌రావు, వర్కింగ్ చైర్మన్ గంట వెంకటరమణరెడ్డి, ఆలయ కార్యదర్శి ముప్పిడి రవీందర్, కోశాధికారి విశ్వేశ్వర్, వైస్ చైర్మన్ తులసిరాంగౌడ్, సత్యం, నాయకులు వేగోలపు సత్యనారాయణ, రఘుపతి పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, జూలై 21: గోదావరిఖని విఠల్‌నగర్‌లో శ్రీదేవి విద్యానికేతన్ పాఠశాలను స్థాపించిన పాపయ్యశాస్త్రిని పూర్వవిద్యార్థులు సన్మానించారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు పాపయ్యశాస్త్రి దంపతులను ఆయన నివాసం వద్ద సన్మానించి రూ.5500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెల్ల కుమార్, సీపీఐ కనకరాజ్, అబ్దుల్ గఫూర్, ఆకుల వీరేశం, గుండబోయిన అజయ్, కుక్కల రాజయ్య, తాటికొండ శ్రీనివాస్, గాజుల అంజయ్య, వాసంపెల్లి ఆనంద్, బంగారు రమేష్, మేకల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీ-2 మృతుడి కుటుంబానికి పరామర్శ

రామగిరి, జూలై 21: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి తమ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు భార్య తమకు జరిగిన అన్యాయాన్ని నేతలకు వివరించారు. తన భర్త ప్రమాదానికి అధికారుల వేధింపులు, నూతనంగా గెలిచిన యూనియన్ నేతలే కారణంగా పేర్కొంది. తమ న్యాయం చేయాలని వారు కోరగా బీఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని హామీనిచ్చారు. వారి వెంట మర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శంకేషీరవీందర్, మాజీ ఎంపీటీసీ ధర్మాల రాజ్‌సంపత్, నాయకులు కాపురబోయిన భాస్కర్, వెముల రవీశంకర్, దేవశ్రీనివాస్, కిరణ్, బుద్దె ఉదయ్, మట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1 రక్షణ చర్యల పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 21: ఓసీపీ-1 ప్రాజెక్టులో చేపడుతున్న రక్షణ చర్యలను ఆదివారం ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు పరిశీలించారు. ఆర్ జీ-3 వైస్‌ప్రెసిడెంట్ కోటా రవీందర్‌రెడ్డి, సెంట్రల్ కమిటీ మెంబర్ గడ్డం తిరుపతిలు మైన్‌కి సంబంధించి క్వారీ పరిసర ప్రాంతాల్లో 60టన్, 100 టన్ డంపర్ల పార్కింగ్ యార్డ్స్, కోల్ బెంచ్, కోల్‌యాడ్‌లో కార్మికులు పని చేస్తున్న పనిస్థలాలను పరిశీలించారు. వ్యూ పాయింట్‌లో పరిస్థితులను సేఫ్టీ కమిటీ మెంబర్ టీ ప్రవీణ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో ఉత్పత్తికి విఘాతం

- ఆర్జీ-3 డివిజన్‌లో 60 వేల టన్నులు నష్టం - రెండు రోజులుగా కురుస్తున్న వర్షం

రామగిరి, జూలై 21: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-1, 2లలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ప్రాజెక్టుల్లోకి వర్షం నీరుతో పాటు వరద చేరడంతో రోడ్లు బురదమయంగా మారాయి. ఆర్జీ-3 డివిజన్‌లోని రెండు ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో రోజు వారిగా 30 వేల టన్నులు ఉత్పత్తి వెలికితీసే అవకాశం ఉంటుంది. క్వారీల్లోని రోడ్లు బురద కారణంగా పనులు కొనసాగక సుమారు 60 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. క్వారీలో పనులు కొనసాగపోవడంతో డంపర్‌లను డంప్ యార్డ్‌లో నిలిపివేశారు. సోమవారం వర్షం అనుకూలించినట్లయితే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.


ఓసీపీ-2లో నిలిచిపోయిన డంపర్‌లు

ఆర్థికంగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వం

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 21: సింగరేణి సంస్థని ఆర్థికంగా దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, ఆర్థిక దోపిడిని నుంచి సంస్థను కాపాడుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం పేర్కొన్నారు. ఆదివారం కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆర్థికంగా దోచుకున్న దానికి ప్రతిఫలంగా కార్మికులు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, అదేబాటలో ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తూ సింగరేణిని ఆర్థికంగా దోచుకోవడానికి తెరలేపిందన్నారు. దానిలో భాగంగానే రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పేరుతో సింగరేణి సొమ్మును దోచిపెట్టడానికి కొత్తపథకాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. పేరు రాజీవ్‌గాంధీ ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం సొమ్ముమాత్రం సింగరేణిదన్నారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, బుర్ర తిరుపతి, పాల్గొన్నారు.

బోనాల వేడుకలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సుల్తానాబాద్, జూలై 21: సుల్తానాబాద్ పట్టణంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలతో పాటు పోచమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావ, మినుపాల ప్రకాష్ రావు ముఖ్య అతిథి గా పాల్గొని బోనాల ఉత్సవాలలో పూజలు చేశారు. గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచులు పుష్పలత, అంతటి అన్నయ్య గౌడ్, గడ్డం అంజయ్య గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, అంతటి చిరంజీవి, మంద మల్లయ్య, వెంకటేశ్, మంద శ్రీనివాస్ గౌడ్, భైరగోని ప్రభాకర్, కొయ్యడ శ్రీనివాస్, నాగార్జున, మధుకర్, బాలసాని శ్రీనివాస్, కెక్కర్ల శ్రీను, పొన్నం తిరుపతి, కొయ్యడ వెంకటేశ్, ఎల్లయ్య, బుర్ర సంపత్, పోడేటి వెంకటేశ్, తోడేటి రాములు, సంతోష్, తదితరలు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'

పెద్దపల్లి టౌన్, జూలై 21: తెలంగాణ సాధన ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి జరగబోయే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై చర్చించి ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, పార్లమెంట్ కన్వీనర్ బత్తుల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల గట్టయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు దుబ్బేటి చంద్రకళ, ఉపాధ్యక్షులు మంద భాస్కర్, కార్యదర్శి కళాధర్ రెడ్డి, శారద, లక్ష్మీ, భారతి, చంటి, నరసక్క, రౌతు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పెద్దపల్లిటౌన్, జూలై 21: రాష్ట్రంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నాయిబ్రాహ్మణ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని, ఆదిశగా సీఎం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని, పాలక మండలి ఏర్పాటు చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో నాయిబ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు సొన్నాయిటెంకం సురేష్, నాయకులు గొల్లపెల్లి రాజమల్లు, ముత్యాల భూమయ్య, సొన్నాయిటెంకం తిరుపతి, హరీశ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకాలు


పతకాలు సాధించిన సుల్తానాబాద్ విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 21: ఇంటర్నేషనల్ స్థాయి కరాటే పోటీలలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ కు చెందిన విద్యార్థులు బంగారు పతకంతో సహా పలు పతకాలను సాధించారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం యూసుఫ్‌గూడాలో గ్రాండ్ మాస్టర్ మద్ది కన్నన్ గౌడ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ - 2024 కరాటే, కుంగ్ ఫూ పోటీలు జరిగాయి. ఈ ఇంటర్నేషనల్ స్థాయి పోటీలలో మొత్తం ఆరు దేశాలు, ఎనిమిది రాష్ట్రాల నుంచి 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో సుల్తానాబాద్ కు చెందిన మంకీ ఫిస్ట్ కుంగ్ ఫూ ఆకాడమీ నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ముగ్గురు అత్యుత్తమ ప్రతిభను చాటుకున్నారు. జి హర్షవర్ధన్ రెండు బంగారు పతకాలు, జి రిషి వర్ధన్ ఒక బంగారు పతకం సాధించారు. ఈ అబినయ్ ఒక సిల్వర్ పతకం సాధించారు. ఈ పోటీల అనంతరం ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదాన కార్యక్రమంలో శ్రీలంక, నేపాల్, థాయ్‌లాండ్ దేశాల గ్రాండ్ మాస్టర్ల చేతుల మీదుగా అందుకున్నారని మంకీ ఫిస్ట్ ఆకాడమీ మాస్టర్ జి సతీష్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిని సతీష్ అభినందించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 21: తడిచిన చేతులతో స్టార్టర్లు గాని మోటర్లు కరెంటు స్థంబాలను పట్టుకోవద్దని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైనుకు చెట్ల కొమ్మలు తగిలితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. స్విచ్ బోర్డులను, బయటపెట్టిన లైట్లను నీటిలో తగలకుండా చూసుకోవాలని తెలిపారు. చిన్నపిల్లలను కరెంటు వస్తువుల వైపు రాకుండా, ఉతికిన బట్టలను ఇనుప తీగల మీద వేయకుండా చూడాలని, వర్షం పడేటప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్లను స్విచ్ ఆఫ్ చేసి ఉంచాలని, కరెంట్ లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయితే సంబంధిత జేఎల్ఎంలకు, కార్యాలయం సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 21: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీటి ప్రవాహం ఎక్కువ ఉన్నందున మండలంలోని మానేరు పరివాహక గ్రామాలు పోచంపల్లి, మిర్జంపేట, కిష్టంపేట, మొట్లపల్లి, చిన్నారతుపల్లి, పెద్దరాతపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ జహేద్ పాషా తెలియజేశారు. రైతులు కరెంటు మోటార్లు కోసం వెళ్లకూడదన్నారు. పశువుల కాపరులు అదేవిధంగా మత్స్యకారులు వాగు వైపు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, నీటి ప్రభావం ఎక్కువ ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

నర్సాపూర్‌వాసికి డాక్టరేట్


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సృజన్

ఎలిగేడు, జూలై 21: మండలంలోని నర్సాపూర్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన సృజన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగం పర్యావరణ శాస్త్రంలో జీవ-గార్బేజ్ ఎన్జైమ్ ద్వారా వ్యర్థ జలాల పారిశుధ్యం కోసం పరిశోధనకు డాక్టరేట్ లభించింది. వేపచెట్టుకు వస్తున్న తెగులు నివారణ కోసం పరిశోధనలకు డాక్టర్.శశికళ, డాక్టర్ కాముని రాజుతో పేటెంట్ హక్కులు పంచుకున్నారు. సృజన్ గురుకుల విద్యార్థి ఖైరతాబాద్ గవర్నమెంట్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చేసినట్లు ఆయన తెలిపారు.